క్లుప్తంగా

ప్రత్యేక తరగతుల తనిఖీ


ప్రత్యేక తరగతులను తనిఖీ చేస్తున్న డీఈఓ

దెందులూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులను జిల్లా విద్యాశాఖ అధికారిణి వెంకటలక్ష్మమ్మ తనిఖీ చేశారు. శుక్రవారం దెందులూరు జూనియర్ కళాశాలను ఆమె తనిఖీ చేసి, ఉపాధ్యాయుల నుంచి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. టెన్త్, ఇంటర్ విద్యార్థులు పరీక్షల్లో పాస్ కాలేదని బాధపడొద్దన్నారు. ప్రణాళిక క్రమశిక్షణ నిరంతర సాధనతో సాధించలేనిది ఏమీ లేదని పట్టుదలతో చదివి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. హెచ్ఎం మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు లవరాజు, ప్రకాష్, జయ శ్రీభాస్కర్, శ్రీనివాసరావు, గ్రంథాలయాధికారి గొల్లపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు


వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు


ఉంగుటూరు: పాకిస్తాన్-ఇండియా మధ్య యుద్ధ వాతావరణ నేపథ్యంలో జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఉంగుటూరు టోల్ ప్లాజా వద్ద గురువారం రాత్రి 9 నుంచి 11.30 గంటల వరకు వాహనాలు తనిఖీ చేశారు. ఆయుధాల రవాణా, అనుమానితులను పట్టుకునేందుకు ఈ తనిఖీలు నిర్వహిలంచామని పోలీసులు తెలిపారు. నిడమర్రు సీఐ సుభాష్, గణపవరం ఎస్సై మణికుమార్, నిడమర్రు ఎస్సై ప్రసాద్, చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్, 15 మంది పోలీసులు పాల్గొన్నారు.

వారి సేవలు ఆదర్శనీయం


హెచ్ఎంను సన్మానిస్తున్న మాజీ ఎంపీ రవీంద్రబాబు

దెందులూరు: హెచ్ఎం సీహెచ్ దాసు, కండక్టర్ కొమ్ముల వెంకటేశ్వరరావు కొవ్వలి గ్రామానికి ఆదర్శమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ మాజీ ఎంపీ డాక్టర్ పి.రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం కొవ్వలి సాల్వేషన్ ఆర్మీ పాఠశాలలో ఉద్యోగ విరమణ చేసిన హెచ్ఎం సీహెచ్ దాసు, ఆర్టీసీ కొమ్ములు వెంకటేశ్వరరావులకు పౌర సన్మానం చేశారు. విద్య, వైద్యం, సామాజిక, సేవా రంగాల్లో ప్రణాళికా బద్ధంగా వారు అందించిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కాటి సుధాకర్, మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, గొల్ల వీరాస్వామి, కాటి అర్జున్, రాజు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, యువత, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనారోగ్యం


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శ్రీదేవి

దెందులూరు: బాల్య వివాహాలతో అనారోగ్యం, దుష్పరిణామాలు ఎదురవుతాయని ఐసీడీఎస్ పోతునూరు సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని సీతంపేట అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. మారుతున్న కాలానుగుణంగా ఆహారపు అలవాట్లు నియంత్రించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీశిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా మహిళా శిశు సంక్షేమ అభివృద్ధికి చేస్తున్న సేవలను, కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వర్ధమాన కవులు, కళాకారులు, రచయితలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు నిర్వహిస్తున్నామని శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ప్రతాప్ మాట్లాడారు. శ్రీ శ్రీ కళావేదిక నిరంతర సాహితీ క్రతువులో భాగంగా మే నెల 10, 11 తేదీల్లో స్థానిక మహాలక్ష్మి గోపాల స్వామి కల్యాణ మండపంలో ప్రపంచ స్థాయిలో తెలుగు సాహితీ సంబరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకు 147 జాతీయ శతాధిక కవి సమ్మేళనాలు, సాహిత్య సదస్సులు, కళారంగ ప్రదర్శనలు నిర్వహించామని వివరించారు. సమావేశంలో జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జీ. ఈశ్వరీ భూషణం, ప్రధాన కార్యదర్శి టి.పార్థసారథి, సుజయ్ కృష్ణ, గురు శర్మ, వెంకటేశ్వరరావు, ఐజాక్ పాల్గొన్నారు.

వేసవి విడిది.. విజ్ఞాన వారధి


భీమడోలులో పోటీల్లో కథలు చెబుతున్న విద్యార్థిని సుష్మిత


పూళ్లలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థినీ విద్యార్థులు

- వేసవిలో గ్రంథాలయాల బాట పట్టిన బాలలు
- ఉత్సాహంగా శిక్షణలో పాల్గొంటున్న చిన్నారులు

భీమడోలు: వేసవి సెలవులొచ్చాయంటే చాలు నెలన్నరపాటు అల్లరి మిన్నంటుతుంది. పిల్లలు ఇల్లు పీకి పందిరేస్తున్నారు బాబోయ్ అంటూ పెద్దలు వాళ్ల అల్లరికి ప్రతిస్పందించడం పరిపాటి. కాని అందుకు భిన్నంగా ఆ సెలవులే చిన్నారుల విజ్ఞాన వినోదాలకు నెలవు కావాలన్న సదాశయం గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతుల మూలంగా తీరుతుంది. వేసవి సెలవుల వేళ చిన్నారులు గ్రంథాలయాల బాట పడుతున్నారు. ఏడాది పొడవునా తరగతి గదిలో పాఠ్య పుస్తకాలతో కుస్తీ పడిన విద్యార్థులు తన సమీపంలోని గ్రంథాలయాలకు వెళ్లి తన ఆలోచనలకు పదును పెడుతున్నారు. 40 రోజుల పాటు పఠనాభ్యాసాన్ని దీక్షగా సాగిస్తున్నారు. గత నెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు ఐదేళ్ల నుంచి 15 ఏళ్ల వయస్సు గల విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు శిక్షణ కార్యక్రమాలను చేపడతున్నారు. సెలవుల్లో చదువుకునేందుకు సహజంగా విద్యార్థులు ఇష్టపడరు. అయితే ఇందుకు భిన్నంగా గ్రంథాలయానికి విద్యార్థులు క్రమం తప్పకుండా ప్రతిరోజూ వేసవి శిక్షణ తరగతులకు హాజరవుతున్నారు. పుస్తక పఠనం ద్వారా సృనాత్మకత, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు దోహదపడుతున్నాయి. వేసవి సెలవులకు ముందుగా గ్రంథాలయ బాట పేరిట నిర్వహించిన ప్రచారం సత్ఫలితాలిస్తోంది.

ఉంగుటూరు నియోజకవర్గంలో..

ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లోను, దెందులూరు నియోజకవర్గంలోని దెందులూరు, ఏలూరు రూరల్, పెదపాడు, పెదవేగి మండలాల్లో ఉల్లాసభరిత వాతావరణంలో వేసవి విజ్ఞాన తరగతులు జరుగుతున్నాయి. ఉంగుటూరు నియోజకవర్గంలోని ఏడు శాఖా గ్రంథాలయాల్లోను, దెందులూరు నియోజకవర్గంలోని ఐదు శాఖా గ్రంథాలయాల్లోను జరుగుతున్న శిక్షణ తరగతులను చిన్నారులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రతి ఒక్కొక్క గ్రంథాలయానికి 30 నుంచి 50 మంది చొప్పున గ్రంథాలయానికి వచ్చి శిక్షణాంశాలను ఆసక్తితో అనుసరిస్తున్నారు.

పఠనాసక్తి పెరుగుతుంది



ప్రస్తుత తరానికి పుస్తక పఠనం అలవాటు బాగా తగ్గిపోతుంది. అధునాతన సాంకేతిక విజ్ఞానం, సెల్‌పోన్లు, వాట్సాప్‌లు, ఫేస్‌బుక్‌లు అందుబాటులోకి రావడంతో పిల్లలు వాటికి ప్రభావితులవుతున్నారు. దీంతో వారిలోని సహజమైన విజ్ఞానం పెంపొందించుకునే గుణం దెబ్బతింటుంది. వారిలో విద్యావికాసాన్ని పెంపొందించడంతో పాటు వ్యక్తిత్వ వికాసం వైపు మళ్లించడం, పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చాలి.

– మండే సుధాకర్, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, సూరప్పగూడెం

పిల్లల్లో ఉత్సాహం పెరుగుతుంది



సెలవులంటే పిల్లలను ఏ విధంగా నియంత్రించాలన్న భయం తల్లిదండ్రులకు ఉంటుంది. వారిని అదుపు చేయడం పెద్దలకు కాస్త కష్టమే. ఇలాంటి తరుణంలో తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు పంపితే వారిలో సమగ్రాభివృద్ధి, ఉత్సాహం పెరుగుతాయి.

– తుమ్మల ఉమామహేశ్వరరావు, మానవత జిల్లా డైరెక్టర్, భీమడోలు

సెలవులను సద్వినియోగం చేసుకోండి



వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. సెల్‌ఫోన్ వద్దు.. పుస్తకమే ముద్దు అనే నినాదాన్ని విద్యార్థులకు వివరిస్తున్నాం. గ్రంథాలయంలో విద్యార్థులకు అవసరమైన విజ్ఞానాన్ని అందించేందుకు పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పుస్తక పఠనంపై ఆసక్తిని కనబరుస్తున్నారు.

– జి.నాగమణి, గ్రంథపాలకురాలు, గుండుగొలను

సమష్టి కృషితో పార్టీ బలోపేతం


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు

దెందులూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతం, సమష్టి కృషితో సాధ్యపడుతుందని పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కామిరెడ్డి నాని అన్నారు. శుక్రవారం శ్రీరామవరం గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దెందులూరు ఎమ్మెల్యేగా కొఠారు అబ్బయ్య చౌదరి అనూహ్య విజయం సాధించడం తథ్యమన్నారు. శివారు గ్రామ మండల నియోజకవర్గ స్థాయిలో సమష్టిగా పార్టీ బలోపేతానికి అంకితభావంతో సేవలందించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కినేని శ్రీనివాసరావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 21 మంది ఎంపిక

ఏలూరు (టూటౌన్): స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు 85 మంది అభ్యర్థులు హాజరుకాగా, వీరిలో 21 మంది ఎంపికయ్యారని జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నేషనల్ కెరీర్ సర్వీస్ కోఆర్డినేటర్ జి.ప్రవీణ్ కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాల పరంగా ముందంజలో ఉండాలని, అందుబాటులో ఉన్న అవకాశాలను ఉపయోగించుకోవాలని యువతకు సూచించారు. ఈ మేళాలో శ్రీరామ్ చిట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డైకిన్ ఇండియా, అపోలో టైర్స్ లిమిటెడ్, వేరియంట్ ప్రైమరీ స్కూల్, ఎల్ఐసీ ఆఫ్ ఇండియా తదితర సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కార్యాలయ సిబ్బంది జి.ప్రవీణ్ శ్రీవత్సవ, ఎస్ పావని, నాగవల్లి, నిరుద్యోగులు పాల్గొన్నారు.

మోసపోయిన ప్రజలకు అండగా..


వాసుబాబును కలిసిన వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నాయకులు

గణపవరం: ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన బూటకపు హామీలను నమ్మి మోసపోయిన పలు వర్గాల ప్రజలకు వైఎస్సార్‌సీపీ నాయకులు అండగా నిలబడాలని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు పుప్పాల వాసుబాబు సూచించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, సంక్షేమ పథకాలన్నీ నిలిచిపోయాయని ఈ సమయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలకు అన్ని విధాలా అండగా నిలవాలన్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీకి జిల్లా, రాష్ట్ర స్థాయిలో పార్టీ పదవుల్లో నియామకం పొందిన నాయకులు వాసుబాబును కలిసి తమను పార్టీ పదవుల్లో నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వారితో సమావేశమయ్యారు. వాసుబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అన్నిరకాల నిత్యావసర సరకుల ,దరల పెరుగుదల, విద్యుత్ చార్జీల పెరుగుదల, వంట గ్యాస్ ధర పెరుగుదల, విద్యుత్ కోతలు, మహిళలపై అత్యాచారాలు, ఫ్యాక్షన్ హత్యలు పెరిగిపోయాయని, వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, నిడమర్రు ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, నిడమర్రు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సంకు సత్యకుమార్, జిల్లా వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ షకీల్ రహమాన్, జిల్లా అధ్యక్షుడు కామిల్ జమ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రీసర్వే నోటీసుల అమలు


రీసర్వే చేస్తున్న అధికారులు

దెందులూరు: రీసర్వే పైలెట్ ప్రాజెక్టు గ్రామాల్లో రైతులకు 9(2) నోటీసులు అమలు పరుస్తున్నామని తహసీల్దార్ బి.సుమతి, రీసర్వే దెందులూరు మండలం డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర అన్నారు. శుక్రవారం మండలంలో రీసర్వే పైలట్ ప్రాజెక్ట్ గ్రామాలు కేఎస్‌పురం, రామారావుగూడెం గ్రామాల్లో రీసర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుమతి మాట్లాడుతూ రీసర్వే పారదర్శకంగా నిర్వహించడానికి ప్రతి రైతుకూ భూమిని పోల్చినప్పుడు వారి విస్తీర్ణం తెలుపుటకు నోటీసులు ఇస్తామన్నారు. రీసర్వే కి సంబంధించి ముందుగా రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించామన్నారు. గ్రామాల సరిహద్దులను నిర్ణయిస్తామన్నారు. ప్రతి ఒక్క రైతూ వారి భూములకు సంబంధించిన దస్తావేజులు, పాసు పుస్తకం, బ్యాంక్ అకౌంటు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, మొబైల్ నంబర్ రామారావుగూడెం గ్రామ సచివాలయంలో ఇవ్వాలని సూచించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు


మంచినీటి చెరువు నీటి నాణ్యతను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో సుందరి

భీమడోలు: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా పంచాయతీలు అన్ని చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో ఎ.సుందరి అన్నారు. పంచాయతీ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం అంబర్‌పేట, కురెళ్లగూడెం గ్రామాల్లో ఆమె పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీ, మంచినీటి చెరువుల నీటి మట్టాలు, వాటర్ ట్యాంకు పరిశుభ్రపరచడం, పైపు లైన్ లీకేజీల రిపేర్ తదితర అంశాలపై ఆమె సంబంధిత గ్రామ కార్యదర్శుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కురెళ్లగూడెంలోని మంచినీటి చెర్వు నీటి మట్టాన్ని పరిశీలించి, నీటి నాణ్యతపై పరీక్షలు చేయించారు. గ్రామాల్లో మంచినీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి 15 రోజులకో సారి ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను పరిశుభ్రం చేసి అక్కడ తేదీలను నమోదు చేయాలని సూచించారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. సేంద్రియ ఎరువు భూసారానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సేంద్రియ ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. తద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీల అభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ ఎఫ్‌టీసీ భూషణం, కార్యదర్శులు వెంకట్రావు, ఐ.గౌతమీదుర్గ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తూనికలు, కొలతలపై అవగాహన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూనికలు, కొలతల వినియోగం, రైతు బజార్, చికెన్, మటన్, కిరాణా దుకాణాల్లో వివిధ వ్యాపారులు చేసే మోసాలపై తూనికలు, కొలతల శాఖ అధికారులు అవగాహన కల్పించారు. స్థానిక డీమార్ట్ వ్యాపార సంస్థలో శుక్రవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. వస్తువు ఎంఆర్‌పీ ధర కంటే ఎవరూ ఎక్కువ ధరకు అమ్మకూడదని అన్నారు. ప్యాకేజీలపై తయారీదారుని పేరు, వస్తువు పేరు, నికర బరువు, తయారు చేసిన తేదీ, గరిష్ట చిల్లర ధర, వినియోగదారులు చేసే ఫిర్యాదుల కోసం ఉండాల్సిన సెల్ ఫోన్ నెంబర్, ఇ మెయిల్ తదితరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమములో తూనికలు, కొలతల శాఖ ఉప నియంత్రకులు హరిప్రసాద్, సహాయ నియంత్రకులు సాయి రామ్, భీమవరం సహాయ నియంత్రకులు వీవీ నాగ రాజారావుపాల్గొన్నారు.

10 లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఎస్సీ కార్యాచరణ ప్రణాళికలో ఓబీఎంఎస్ పోర్టల్‌లో లబ్ధిదారులు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం ముక్కంటి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో షెడ్యూల్ కులాల పెద్దలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఓబీఎంఎస్ పోర్టల్‌లో కొన్ని పథకాలకు దరఖాస్తులు లక్ష్యం మేరకు నమోదు కాలేదని ముక్కంటి తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు, మార్గదర్శకాలను వివరించారు.

సైనికులకు వాకర్స్ సంఘీభావం

ఏలూరు రూరల్ : పాకిస్తాన్‌తో యుద్ధం చేస్తోన్న మన సైనికులకు ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు జేజేలు పలికారు. శుక్రవారం ఉదయం అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎస్ఎం అక్బర్, అధ్యక్షుడు పి.నాగవిఘ్నేశ్వరరావు, మేరీ మాణిక్యం తదితరులు జాతీయ జెండా చేతబట్టి స్టేడియంలో భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ఉగ్రవాదులపై దాడి చేసి తుద ముట్టించిన సైనికుల ధైర్యాన్ని కొనియాడారు. ప్రజలంతా సైన్యానికి మద్దతుగా నిలవాలని కోరారు.

మురళి నాయక్‌కు నివాళి

ఏలూరు (టూటౌన్): దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళీనాయక్ అని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రాష్ట్ర సమితి సభ్యుడు బండి వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. భారత నియంత్రణ రేఖ వద్ద పాక్ సైన్యం భారత పోస్టులపై కాల్పులతో విరుచుకుపడిన నేపథ్యంలో వారితో వీరోచితంగా పోరాడిన రాష్ట్రానికి చెందిన సత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన మురళి నాయక్ తీవ్ర బుల్లెట్ గాయాలతో యుద్ధ రంగంలోనే వీరమరణం పొందారని తెలిపారు. మురళికి ఘనంగా నివాళులర్పించారు. మురళి నాయక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

హాస్టల్ పిల్లలను కన్నబిడ్డల్లా చూసుకోవాలి

ఏలూరు (టూటౌన్): హాస్టల్‌లో పిల్లలను సొంత బిడ్డల్లా చూసుకొని, భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు సూచించారు. శనివారపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. పిల్లలకు సంరక్షణ, వైద్యం, విద్య, శిక్షణ అభివృద్ధి, పునరావాసం కోసం ఈ గృహాన్ని ఏర్పాటు చేశారని రత్నప్రసాదు తెలిపారు. ప్రతినెలా ఈ వసతి గృహాన్ని సందర్శించి బాలలకు అందుతున్న సేవలు, సౌకర్యాలపై విచారించాల్సి ఉందని చెప్పారు. అందులో భాగంగా శుక్రవారం వసతి గృహాన్ని సందర్శించామని, అబ్జర్వేషన్ హోమ్‌లో ఉన్న బాలలకు అనగా చట్టంతో విభేదించిన బాలలకు అందుబాటులో ఉన్న న్యాయ సహాయం, వసతులపై అడిగి తెలుసుకున్నట్టు తెలిపారు. వసతి గృహ అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

తమ్మిలేరును కాటేస్తున్న కాలుష్యం


బాలయోగి వంతెన సమీపంలో వ్యర్థాలతో నిండిన తమ్మిలేరు


తంగెళ్లమూడి వద్ద తమ్మిలేరులో అల్లుకుపోయిన గుర్రపు డెక్క


అశోక్‌నగర్ వద్ద గుర్రపు డెక్కతో నిండిన తమ్మిలేరు


ఏలూరు కొత్త బస్టాండ్ సమీపంలోని పడమర లాకుల వద్ద ఇలా..

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరానికి ఇటు పడమర, అటు తూర్పువైపు తమ్మిలేరు విస్తరించి ఉంది. నిర్వహణ లోపం కారణంగా తమ్మిలేరులో పెద్ద ఎత్తున గుర్రపుడెక్క, తూడు, చెత్త పేరుకుపోయాయి. నగర ప్రజలు వేస్తోన్న అన్నిరకాల వ్యర్థాలతో పాటు జంతు కళేబరాలు తమ్మిలేరులో దర్శనమిస్తున్నాయి. దీంతో దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లి ఏటిగట్టు ప్రాంతంలో నివాసించే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. తక్షణం తమ్మిలేరు ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలని ఏలూరు నగర ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

రెండు పాయలుగా తమ్మిలేరు ప్రవాహం

చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం ప్రాజెక్టు వద్ద నుంచి ప్రారంభమైన తమ్మిలేరు ఏలూరు వద్దకు వచ్చేసరికి ఏలూరు – చింతలపూడి మార్గంలోని ఎఫ్‌సీఐ గొడౌన్స్ వద్ద నుంచి తమ్మిలేరు రెండు పాయలుగా చీలుతుంది. ఒక పాయ తూర్పు వైపు నుంచి తంగెళ్లమూడి, ఏటిగట్టు, మార్కెట్ యార్డు రోడ్డు, రైల్వేట్రాక్ దాటుకుని తూర్పు లాకుల వద్ద కొల్లేరులో కలుస్తుంది. మరో పాయ అశోక్ నగర్, అమీనాపేట, గ్లేవియర్ నగర్ మీదుగా ఏలూరు నగరం మధ్య నుంచి ప్రవహించి పడమర లాకుల వద్ద నుంచి కొల్లేరులోకి ప్రవేశిస్తుంది.

వేసవి, సీతాకాలాల్లో దుర్గంధం

వర్షాకాలం నీరు దిగువకు ప్రవహిస్తుండటంతో ప్రజలకు ఇబ్బంది ఉండదు. వరద నీరు వస్తున్న సమయంలో తమ్మిలేరులోని వ్యర్థాలూ నీటి ప్రవాహంతో కొల్లేరులోకి వెళుతుంటాయి. వర్షాకాలం అనంతరం తూర్పు, పడమర లాకులను పూర్తిగా మూసివేస్తారు. వ్యర్థాలు ఎక్కడివక్కడ పేరుకుపోయి దుర్గంధం వెదజల్లి ప్రజలకు ఇబ్బందులు తప్పవు.

వైఎస్సార్ సీపీ హయాంలో వరద నివారణ

తమ్మిలేరు వరదలకు ఏటా ఏలూరు నగరంలోని పల్లపు ప్రాంతాలు నీట మునిగి ప్రజలు నానా అవస్థలు పడుతుంటారు. దీంతో వైఎస్సార్ సీపీ హయాంలో తమ్మిలేరు వరద నివారణ చర్యలు చేపట్టింది. తమ్మిలేరుకు పలు చోట్ల రూ.140 కోట్లు వరకు వెచ్చించి రివిట్మెంట్‌లు నిర్మించింది. దీంతో నగర వాసులకు వరద ముప్పు తప్పింది. ఇక చేయాల్సిందల్లా ఏటా సాధారణ నిర్వహణ మాత్రమే. దీన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తమ్మిలేరు కాలుష్య కోరల్లో చిక్కుకుంది. తమ్మిలేరులో నీటి ప్రవాహానికి అన్ని రకాల వ్యర్థాలూ ఆటంకంగా మారాయి. కాలుష్య నివారణకు నగరపాలక సంస్థ ప్రజలకు అవగాహన కల్పించాల్సిన కార్యక్రమాలపై దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి.